## భద్రకాళి శరణం మమ!

శ్రీభద్రకాళి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం చంద్రఘంటా క్రమంలో అమ్మవారిని ఉత్సవమూర్తిగా అలంకరించారు. అనంతరం సింహవాహన సేవ, సాయంత్రం మహిషాసుర మర్దిని దుర్గా క్రమంలో అలంకరించి గజవాహనసేవ జరిపారు. వాహనసేవలో ఊరేగుతున్న అమ్మవారికి మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. భద్రకాళీ శరణం మమః అంటూ ప్రణమిల్లారు. జగన్మాత దర్శనంతో మంత్ర సిద్ధి కలుగుతుందని ప్రధానార్చకుడు శేషు తెలిపారు. తెలుసు బాస్కర్, శిరీష, విశ్వతేజ, నక్షత్ర తదితరులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఐపీఎస్ అధికారి గిరిజా శంకర్, అన్నపూర్ణ దంపతులు, సీఐఎస్ఎఫ్ డీజీ అపరాజిత తదితర ప్రముఖులు భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఈవో శేషు భారతి పర్యవేక్షించారు. – న్యూస్‌టుడే, రంగంపేట



సింహ వాహన సేవలో మహిళలు

## నేడు నీటి సరఫరా ఆలస్యం

**కార్పొరేషన్, న్యూస్‌టుడే:** వరంగల్ ప్రాంతం దేశాయిపేట జోన్ పరిధిలో ఆదివారం తాగునీటి సరఫరా ఆలస్యం అవుతుందని గ్రేటర్ వరంగల్ ఈఈ ఆర్.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్తు సరఫరా అంతరాయంతో ధర్మసాగర్ చెరువు నుంచి రా వాటర్ పంపింగ్ ఆలస్యమైందని, దీంతో ఆదివారం నీటి సరఫరాలో స్వల్ప అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు గమనించి, సహకరించాలని కోరారు.

## ముగిసిన కేయూ సెర్చ్ కమిటీ సమావేశం

**ఈనాడు, వరంగల్, కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే:** కాకతీయ విశ్వవిద్యాలయం 15వ ఉప కులపతి నియామకం కోసం ఏర్పాటైన సెర్చ్ కమిటీ కీలక సమావేశం శనివారం ముగిసింది. వీసీ నియామకం కోసం ఏర్పాటు చేసిన త్రిసభ్య అన్వేషణ కమిటీ సభ్యులు జమ్మూ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య సంజీవ్ జైన్ (యూజీసీ నామినీ), రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి (ప్రభుత్వ నామినీ), జేఎన్‌టీయూ విశ్రాంత ఆచార్యులు ఆవుల దామోదర్ (కేయూ నామినీ)లు హైదరాబాద్‌లోని సచివాలయంలో సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. కేయూ వీసీ పదవి కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల బయోడేటాలను క్షుణ్నంగా పరిశీలించారు. వడపోతల తర్వాత అత్యంత ప్రతిభగల మూడు పేర్లతో జాబితాను తయారు చేశారు. ఈ జాబితాను సీల్డు కవర్‌లో పొందుపరిచి రాష్ట్ర గవర్నర్‌కు పంపించినట్లు సమాచారం. కేయూతో పాటు రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల కోసం గత కొన్ని నెలలుగా జరుగుతున్న కసరత్తు కొలిక్కి వస్తోంది. కేయూ ఉప కులపతి పదవికి ఉన్నత విద్యామండలి దరఖాస్తులు ఆహ్వానించగానే సుమారు 158 మంది వరకు ఆచార్యులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో విశ్రాంత ఆచార్యులు కొందరు కాగా, కేయూతో పాటు, ఇతర విశ్వవిద్యాలయాల్లో ఆచార్యులుగా పనిచేస్తున్న వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం వీసీ నియామకాన్ని అత్యంత పకడ్బందీగా చేపట్టేందుకు సెర్చ్ కమిటీని నియమించింది. కేయూ గత వీసీ తాటికొండ రమేశ్‌పై పలు ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఈ సారి వీసీ నియామకంలో పారదర్శకంగా వ్యవహరించాలని ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలో అన్వేషణ కమిటీ ఎంతో కసరత్తు చేసింది. తాజాగా ఒకసారి సెర్చ్ కమిటీ సమావేశం వాయిదా పడడంతో మళ్లీ ఎప్పుడు జరుగుతుందనే సందేహాలు వెల్లువెత్తాయి. వెంటనే శనివారమే సమావేశం కావడం గమనార్హం. త్వరలో కేయూకు వీసీగా బాధ్యతలు తీసుకునేది ఎవరన్నదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# పండగ ప్రత్యేకం.. సంప్రదాయాల మమేకం

ఆదివారం ప్రత్యేకం

**దసరా, సద్దుల బతుకమ్మ పండగల పేర్లు చెబితే ఎక్కడలేని సంతోషం కలుగుతుంది... ఎక్కడెక్కడో స్థిరపడినవారంతా.. సొంతూళ్లకు సంతోషంగా తరలివస్తారు.. బడులు, కళాశాలలకు సెలవు రావడంతో పిల్లలంతా అమ్మమ్మ, నానమ్మ ఇళ్లకు వచ్చి హాయిగా ఆటలాడతారు.. ఎంగిలిపూల బతుకమ్మ మొదలుకొని దసరా వరకు పల్లెల్లో బోలెడంత సందడి కనిపిస్తుంది. మహిళలంతా గుల్లల్లో, చెరువు కట్టల వద్ద బతుకమ్మ ఆటపాటలతో అలరిస్తారు. ఇక ఓరుగల్లు ప్రాంతంలో ఈ పండగను కొన్ని ఊళ్లల్లో మరింత ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు.. ఆ విశేషాలతో 'ఈనాడు' కథనమిది..**

–ఈనాడు, వరంగల్

అదిగదిగో మా ఊరు..
దసరా వచ్చిందంటే దాని తీరేవేరు..
అన్నాతమ్మీ అంటూ ఆత్మీయ పలకరింపులు
వదినా మరదళ్ల నవ్వుల తుళ్లింతలు..
గునుగు తంగేడు సోయగాలతో బతుకమ్మ ఆటలు..
ఉయ్యాలో.. రామ ఉయ్యాలో.. అంటూ ఆడపడుచుల పాటలు..
బంతి పూలు, మామిడాకులతో స్వాగతం పలికే గుమ్మాలు..
కమ్మని పిండివంటలతో ఇంటింటా ఘుమఘుమలు..
పట్టు పరికిణీల్లో సందడిచేసే పడుచు పిల్లలు..
జమ్మిచెట్టు వద్ద ఆత్మీయ ఆలింగనాలు..
అందుకే పట్నంవారంతా పల్లెబాట పడతారు..
ఎవరికివారు.. ఊళ్లల్లో
'ప్రత్యేకత'ను చాటుతున్నారు.


### ఉప్పొంగే దేశభక్తి



దేశమంతా పంద్రాగస్టు, 26 జనవరి, తదితర రోజుల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. మహబూబాబాద్ జిల్లా గార్లలో మాత్రం దసరా రోజున నెలవంక పోలిన జెండాను ఎగురవేయడం ఆనవాయితీగా వస్తోంది. గార్లలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న క్రమంలో ఆ వీధిని జెండా బజారుగా పిలుస్తున్నారు. పండగ రోజు పంచాయతీ నుంచి ఊరేగింపుగా జెండాను తీసుకెళ్లి మసీదు సెంటర్‌లో ఎగురవేస్తారు. అనంతరం తూర్పాంజనేయ స్వామి ఆలయంలో శమీ పూజ చేస్తారు.

### సరిహద్దు నుంచి సొంతూరుకు

వరంగల్ జిల్లా నర్సంపేటలో అన్ని ప్రాంతాల్లోలాగే వేడుకలు ఎంతో ఉత్సాహంగా చేస్తారు. హైదరాబాద్, వరంగల్ తదితర ప్రాంతాల్లో స్థిరపడ్డవారే కాదు సరిహద్దులో ఉన్న సైనికులు తప్పకుండా వస్తారు.. నర్సంపేటకు చెందినవారు సుమారు 30 మందికిపైగా సైన్యంలో సేవలందిస్తున్నారు.



### భారీ రావణ వధ



వరంగల్ ఉర్సుగుట్ట రంగలీలా మైదానంలో దసరా వేడుకలు కోలాహలంగా జరుగుతాయి. లక్షకుపైగా జనం హాజరై వేడుకల్ని తిలకిస్తారు. 65 అడుగుల రావణాసురుడి బొమ్మ తయారుచేస్తారు. అనంతరం బాణసంచాతో పేల్చేస్తారు. దసరా నాడు స్థానిక ఆర్య సమాజ్ నుంచి ఎడ్లబండిపై సీతారాముల వేషధారణలో కళాకారులను తీసుకొస్తారు. ముందు రంగస్థల కళాకారులు చిరుతల భజన చేస్తూ ఊరేగింపుగా తరలివస్తారు. వీరికి ఉత్సవ కమిటీ స్వాగతం పలుకుతుంది. అనేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాక చివరకు రావణవధ ఉంటుంది. ఇదెంతో కనువిందు కలిగించే ఘట్టం. కర్ణాటకలోని మైసూరు తర్వాత అంత కోలాహలంగా వేడుకలు జరిగేది ఇక్కడే అని స్థానికులు చెబుతారు.

### వందేళ్ల నాటి జమ్మిచెట్టు



పాండవులు అరణ్యవాసం సమయంలో జమ్మిచెట్టుపై ఆయుధాలు పెట్టారని, ఆ తర్వాత చెట్టుమీద నుంచి తీసి యుద్ధానికి వెళ్లే.. విజయం కలిగిందని పురాణ ప్రతీతి.. అందుకే ప్రతి ఊళ్లో దసరా రోజు గ్రామస్థులంతా జమ్మి చెట్టుకు పూజ చేయడం ఆనవాయితీ.. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామంలో సుమారు వందేళ్ల జమ్మి వృక్షం ఉంది. పండగ రోజు సాయంత్రం ఊరివారంతా డప్పుచప్పుళ్లతో పెద్ద గంపలో సొరకాయ, సజ్జ, జొన్న మొక్కలను పట్టుకుని దసరా బండ వద్దకు చేరుకుంటారు. అక్కడ కొత్తగా నిర్మించిన పాకలో సొరకాయకు పూజ చేస్తారు. అనంతరం జంతు బలికి బదులు సొరకాయను కోస్తారు. చారిత్రక జమ్మి చెట్టు వద్దకు వెళ్లి కంకణాలు కట్టుకొని పూజలు చేస్తారు.

### అయిదో రోజు అద్భుతంగా



బతుకమ్మ పండగ అంటే సాధారణంగా మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ, చివరి రోజు సద్దుల బతుకమ్మను ఊరూవాడా సందడిగా చేస్తారు. మహబూబాబాద్ జిల్లావ్యాప్తంగా అనేక గ్రామాల్లో అయిదో రోజు కూడా బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహిస్తారు. భారీ పరిమాణంలో బతుకమ్మలను పూలతో పేర్చి మహిళలు బతుకమ్మలు ఆడి అనంతరం చెరువులో నిమజ్జనం చేస్తారు.

## కోళ్ల పరిశ్రమపై అధికారుల విచారణ



పరిశ్రమ పరిసరాలను పరిశీలిస్తున్న అధికారుల బృందం

**రాయపర్తి, న్యూస్‌టుడే:** మండల కేంద్రం శివారులోని శ్రీసత్యనారాయణ స్వామి కోళ్ల పరిశ్రమ నిర్వహణపై అధికారులు విచారణ చేపట్టారు. కోళ్ల పరిశ్రమ నుంచి వస్తున్న వ్యర్థాలు, రసాయనాలతో చెరువు నీరంతా కలుషితమై గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కారం కోసం గ్రామస్థులు 'పరిరక్షణ కమిటీ'ని ఏర్పాటు చేసుకొని ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె ఆదేశాలనుసారం రెవెన్యూ, పర్యావరణం, గ్రామీణ నీటి సరఫరా, నీటిపారుదల, మండల పరిషత్ అధికారులు శనివారం సంయుక్తంగా విచారణ చేపట్టారు. వ్యర్థాలను నిల్వ చేస్తున్న స్థలాలు, నీటితో కలిసి చెరువులో కలుస్తున్న రసాయనాలు, పరిశ్రమ పరిసరాలు, చెరువులోని నీటిని పరిశీలించి, నాణ్యతా పరీక్షల నిమిత్తం సేకరించారు. పూర్తిస్థాయి నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు. విచారణలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కిషన్, భగీరథ డీఈ శ్రీనివాస్, ఏఈ అనూష, నీటిపారుదలశాఖ డీఈ కిరణ్‌కుమార్, ఏఈ బాలదాసు, పర్యావరణ శాఖ ఏఈ సుభాష్, ఎంపీఓ ప్రకాశ్, ఆర్ఐ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## తాళాలు వేస్తే కానీ.. బకాయిలు చెల్లించలేదు

**ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే:** వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లోని కమీషన్ వ్యాపారులు కొన్నేళ్లుగా దుకాణాల అద్దెలు, మార్కెట్ ఫీజు చెల్లించకుండా.. నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారు. మార్కెట్ అధికారులు ఎన్నిసార్లు అద్దెల కోసం తిరిగినా.. రేపుమాపు అంటూ.. కాలయాపన చేశారు. చివరికి మార్కెట్ కార్యదర్శి సూచన మేరకు.. అద్దె బకాయిలు ఉన్న దుకాణాలకు తాళాలు వేయడంతో.. వ్యాపారులు దారికొచ్చారు. శనివారం ఒకే రోజు రూ.2.80 లక్షల బకాయిలను సదరు వ్యాపారులు చెల్లించారని అధికారులు వెల్లడించారు. ఇంకా వివిధ కమీషన్ దుకాణాల అద్దెలు రూ.14 లక్షలు, వాణిజ్య దుకాణాల అద్దెలు సుమారు రూ.50 లక్షలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. క్రమేణా మిగిలిన బకాయిలను మరికొద్ది రోజుల్లో వసూలు చేస్తామని అధికారులు చెప్పారు.



## కీటకజనిత వ్యాధులను నియంత్రించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్ నాయక్, చిత్రంలో వరంగల్, హనుమకొండ జిల్లాల డీఎంహెచ్‌వోలు

**ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే:** జిల్లాలో డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతున్న దృష్ట్యా నగరంలో డివిజన్ల వారీగా కీటకజనిత వ్యాధుల నియంత్రణ చేపట్టాలని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్ నాయక్ సూచించారు. శనివారం హనుమకొండ జిల్లా కడిపికొండ, మడికొండ ఆరోగ్య ఉప కేంద్రాలను సందర్శించిన అనంతరం జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో వరంగల్, హనుమకొండ జిల్లాల డీఎంహెచ్‌వోలు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, కీటకజనిత వ్యాధుల నియంత్రణ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. వ్యాధులు నమోదైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు, ఇంటింటా జ్వర సర్వే చేయాలన్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాల డీఎంహెచ్‌వోలు డా. వెంకటరమణ, డా. లలితాదేవి మాట్లాడుతూ.. జిల్లాలో వ్యాధుల నియంత్రణకు చేపడుతున్న కార్యాచరణను వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ డైరెక్టర్ నాగయ్య, ఎంటమాలజీ టీం ప్రోగ్రాం అధికారులు డా. పద్మశ్రీ, డా. మదన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డా. గోపాలరావు, డా. ప్రకాశ్, ప్రోగ్రాం అధికారులు డా. మోహన్‌సింగ్, డెమో అశోక్‌రెడ్డి, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, ఇన్‌ఛార్జి మలేరియా అధికారి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

## రంగుమారిన నీరు.. తీరుమారని అధికారులు



నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి ఇంజినీర్లను తరచూ ఆదేశిస్తున్నారు. అయినా క్షేత్రస్థాయిలో పరిస్థితి మారడం లేదు. మేయర్ ప్రాతినిథ్యం వహిస్తున్న 29వ డివిజన్ పాపయ్యపేట, ఓఎస్‌నగర్, రఘునాథ్ కాలనీ, రామన్నపేట పెద్ద మోరీ తదితర కాలనీల్లో వారం, పది రోజులుగా నల్లాల ద్వారా కలుషితమైన తాగునీళ్లు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. 11వ డివిజన్ పోతననగర్, రాజీవ్ కాలనీ, రామయ్య టాకీస్ గల్లీ, రంగంపేట చర్చిలైన్ కాలనీల్లో ఇదే విధమైన పరిస్థితి నెలకొంది. కలుషితమైన తాగునీళ్లు సరఫరా అవుతున్నాయని స్థానిక ప్రజలు బల్దియా ఏఈ రాగి శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేశారు. అయినా పట్టించుకోక పోవడంతో ప్రజలు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. – న్యూస్‌టుడే, రామన్నపేట

## గడ్డం వెంకటస్వామికి ఘన నివాళి



చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా పాలనాధికారి డా.సత్యశారద, ఇతర అధికారులు

మాజీ కేంద్ర మంత్రి, తెలంగాణ ఉద్యమ నేత గడ్డం వెంకటస్వామి జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో జిల్లా పాలనాధికారి డా. సత్యశారద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం, బడుగు బలహీన వర్గాల కోసం ఆయన నిరంతరం శ్రమించారని గుర్తుచేశారు. కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, సూపరింటెండెంట్‌లు మంజుల, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, వరంగల్ కలెక్టరేట్

## కదలని దస్త్రాలు.. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే

**గ్రేటర్ వరంగల్‌లో పౌరసేవలు తీవ్ర ఆలస్యం అవుతున్నాయి. అభివృద్ధి పనులు, ఇతర బిల్లుల చెల్లింపుల దస్త్రాలు చకచకా కదులుతున్నాయి. పౌరులకు సంబంధించిన దస్త్రాలు రోజుల తరబడి తొక్కి పెడుతున్నారు. వివిధ పనుల కోసం నగర ప్రజలు బల్దియా, కాజీపేట, కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.**

భవన నిర్మాణ అనుమతులు, కొత్త ఇంటి నంబర్లు, ఆస్తి పేరు మార్పిడి, కుళాయి కనెక్షన్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ రోజుల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారు. రాష్ట్ర పురపాలక శాఖ జారీ చేసిన సిటిజన్ ఛార్టర్ అమలు కావడం లేదు. ఉన్నతాధికారులు, వింగ్ అధికారులు, క్షేత్రస్థాయి ఉద్యోగులు, పర్యవేక్షకులు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగుల వరకు వందల సంఖ్యలో దస్త్రాలు(ఫైళ్లు) పెండింగ్‌లో ఉన్నాయి. సిటిజన్ ఛార్టర్ అమలుపై కమిషనర్, అదనపు కమిషనర్ సమీక్ష లేకపోవడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

### రెండు విభాగాల్లోనే..

● పన్నుల విభాగంలో కొందరు ఆర్ఐలు కొత్త ఇంటి నంబర్ల కేటాయింపు, ఆస్తిపేరు మార్పిడి దస్త్రాలు ఉద్దేశపూర్వకంగా ఆపుతున్నారు. కాశీబుగ్గ, కాజీపేట సర్కిల్‌లో ముగ్గురు, నలుగురు ఆర్ఐలు ఫోన్లు సైతం ఎత్తడం లేదు. ప్రజలకు జవాబుదారీతనం కరవైంది. పెండింగ్ దస్త్రాలపై ఉప కమిషనర్లు సమీక్షించడం లేదు. పన్నుల విభాగంలో అత్యవసరమైనవి 450- 500 దస్త్రాలు ఆపినట్లు సమాచారం.



బల్దియా కార్యాలయంలో సిటిజన్ ఛార్టర్ బోర్డు

● పట్టణ ప్రణాళిక విభాగం పూర్తిగా అదుపుతప్పింది. టీఎస్-బీపాస్ నిబంధనలు తూచ్ అంటున్నారు. భవన నిర్మాణ అనుమతులు 30-45 రోజుల పాటు పెండింగ్‌లో పెడుతున్నారు. రూపాయి భవన నిర్మాణ అనుమతులు చిన్నాచితక కారణాలతో తిరస్కరిస్తున్నారు. కాశీబుగ్గ సర్కిల్‌లో ఇద్దరు అధికారులు డబ్బులిస్తేనే సంతకాలు పెడుతామంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

## ప్రజావాణి రద్దు

**వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని పాలనాపరమైన కారణాల వల్ల రద్దు చేస్తున్నట్లు జిల్లా పాలనాధికారి డా.సత్యశారద శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.



## జిల్లా ఆసుపత్రిలో వైద్యసేవలు ప్రారంభమయ్యేనా?



నర్సంపేటలోని జిల్లా జనరల్ ఆసుపత్రి

**నర్సంపేట, న్యూస్‌టుడే:** నర్సంపేటలోని ప్రభుత్వ జిల్లా జనరల్ ఆసుపత్రిలో నేటికీ వైద్యసేవలను ప్రారంభించకపోవడంతో జిల్లా ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. సెప్టెంబరు 19న రాష్ట్ర రెవెన్యూ, వైద్యారోగ్య, దేవాదాయశాఖల మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖలు స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వైద్య కళాశాలను ప్రారంభించారు. ఆసుపత్రిలో వైద్యసేవలు అందించేందుకు మరోపది రోజులు పడుతుందని వైద్యులు చెబుతున్నారు. ఆసుపత్రికి కావాల్సిన పడకలు, సామగ్రి వచ్చాయి. ఆగస్టులోనే వరంగల్ నుంచి సీనియర్ వైద్యులు కూడా వచ్చారు. వైద్య సేవలు మొదలు కాకపోవడంతో వైద్యులు రోజు వచ్చి ఖాళీగా కూర్చుంటున్నారు. ఇక్కడ వైద్య సేవలు మొదలు కాకపోవడంతో సీహెచ్‌సీ ఆసుపత్రిలో ఒక్కో పడకపై ఇద్దరు రోగులను పడుకోబెట్టి చికిత్స అందిస్తున్నారు.

### నర్సింగ్ సిబ్బంది లేకపోవడం వల్లే

నర్సింగ్, పారిశుద్ధ్య సిబ్బంది లేకపోవడం వల్లే ఆసుపత్రిలో వైద్య సేవలు మొదలు కాలేదని తెలిసింది. మహబూబాబాద్ జిల్లా ఆసుపత్రి నుంచి కొంత మంది నర్సింగ్ సిబ్బందిని డిప్యుటేషన్‌పై పంపించాలని కోరినట్లు తెలిసింది. ఈ విషయాన్ని వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మోహన్‌దాస్ వద్ద ప్రస్తావించగా.. నర్సింగ్, పారిశుద్ధ్య సిబ్బంది కొరత ఉందన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించామని, ఈనెల 8న వైద్య సేవలను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

## పరిశ్రమల అనుమతులు సులభతరం



కొత్తపేటలో పరిశ్రమల నిర్మాణ చిత్రపటం పరిశీలిస్తున్న 'కుడా' వీసీ, అధికారులు

**కార్పొరేషన్, న్యూస్‌టుడే:** కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసే పరిశ్రమల అనుమతులు సులభతరం చేస్తామని 'కుడా' వైస్ ఛైర్మన్ డా. అశ్విని తానాజీ తెలిపారు. శనివారం అధికారులతో కలిసి కొత్తపేట పరిశ్రమల జోన్‌లో తాజాగా వచ్చిన అనుమతుల స్థలాలు పరిశీలించారు. కొత్త బృహత్ ప్రణాళిక(మాస్టర్ ప్లాన్)లో ప్రతిపాదించిన విధంగా పరిశ్రమల జోన్‌లో స్థలాల లభ్యత, భవిష్యత్తులో చేయాల్సిన అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో సీపీఓ అజిత్‌రెడ్డి, ఏపీఓ రవీందర్, జేపీఓ శంకర్ తదితరులున్నారు.

## పురపాలికలో గ్రామాల విలీనానికి ప్రతిపాదనలు

**నర్సంపేట గ్రామీణం, న్యూస్‌టుడే:** నర్సంపేట మండలంలోని తొమ్మిది గ్రామాలను పురపాలికలో విలీనం చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఈ మేరకు నర్సంపేట మున్సిపల్ కమిషనర్ నుంచి మండల పరిషత్తు అభివృద్ధి అధికారికి ప్రతిపాదన లేఖను శనివారం అందించారు. ప్రతిపాదిత మహేశ్వరం, రాజపల్లి, ముగ్ధుంపురం, ముత్తోజిపేట, రాజుపేట, మాధన్నపేట, నాగుర్లపల్లి, రాములునాయక్‌తండా, పర్శనాయక్‌తండా పంచాయతీల పూర్తి వివరాలను అందించాలని లేఖలో కోరారు. మున్సిపల్ కేంద్రానికి ఆయా గ్రామాలకు మధ్య దూరం, జనాభా, ఓటర్లు, విస్తీర్ణం, పన్నుల ద్వారా వచ్చే ఆదాయం, గృహాల సంఖ్య తదితర పట్టికను పూర్తి చేసి సమర్పించాలన్నారు. గ్రామసభల తీర్మానం ద్వారా పురపాలికలో విలీనం చేస్తారా..? లేదా అనేది తెలియాల్సి ఉంది. సంబంధిత లేఖ రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ నుంచి స్థానిక మున్సిపాలిటీ ద్వారా అందినట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.


# ఈ విద్యాలయం.. సైనికుల కర్మాగారం!

**ఖానాపురం(నర్సంపేట), న్యూస్‌టుడే:** వరంగల్ జిల్లా ఖానాపురం మండలం అశోక్‌నగర్‌లోని సైనిక్ స్కూల్‌లోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ప్రిపరేటరీ అకాడమీ దేశరక్షకులను మెరిక లాంటి సైనికులను అందిస్తోంది. ఇక్కడ చదివిన పలువురు విద్యార్థులు సరిహద్దుల్లో సైనికులుగా పనిచేస్తూ దేశ రక్షణలో పాలు పంచుకుంటున్నారు. ఈ విద్యాలయంలో చేరిన నిరుపేద గిరిజన విద్యార్థులకు విద్య, వసతితో పాటు వ్యాయామం, దేహదారుఢ్యం తదితర అంశాల్లో పటిష్ఠ తర్ఫీదు ఇస్తున్నారు. పలు అంశాలను ఆకళింపు చేసుకుంటున్న విద్యార్థులు.. ప్రభుత్వం నిర్వహించే శారీరక, రాత పరీక్షలను సులువుగా అధిగమించి భారత సైన్యం, అగ్నివీర్, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, నేవీ, పోలీసు తదితర విభాగాల్లో ఎంపికై సేవలందిస్తున్నారు. 1984లో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పాలనలో ఏర్పాటు చేసిన గిరిజన ఆశ్రమ పాఠశాల అంచెలంచెలుగా ఉన్నతీకరణ చెంది సైనిక్‌స్కూల్‌గా మారింది. 2022, 2023 విద్యా సంవత్సరాల్లో త్రివిధ రక్షణ దళాలు, భద్రత, తదితర విభాగాల్లో 22 మంది సేవలందిస్తున్నారు. అగ్నివీర్‌కు నలుగురు, జీడీఎస్ పోస్టల్‌కు ముగ్గురు, ఫైర్‌మెన్ ఏవోసీకి ఒకరు, సీఆర్పీఎఫ్‌కు ఒకరు, బీఎస్ఎఫ్‌కు ఒకరు, భారత సైన్యానికి ఐదుగురు, నావికా దళానికి ఇద్దరు, టీఎస్ పోలీస్ కానిస్టేబుళ్లుగా ఐదుగురు ఎంపికయ్యారు.



సైనిక్ పాఠశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

### డిగ్రీ ద్వితీయ ఏడాదిలోనే ఎంపికయ్యా..



సైనిక్‌స్కూల్‌లో ఇంటర్‌లో చేరాను. డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా ఆర్మీకి ఎంపికయ్యాను. ఇక్కడి అధ్యాపకులు ఇచ్చిన తర్ఫీదు వల్లే ఇది సాధ్యమైంది. ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్‌లో పని చేస్తున్నా. దేశ రక్షకుడిగా పని చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలకు చేరవచ్చు. **-రాము**

### అధ్యాపకుల శిక్షణ తోడ్పడింది



ఇంటర్‌లో పాఠశాలలో చేరాను. భారత సైన్యానికి ఎంపికయ్యేందుకు. అధ్యాపకులు, ఇన్‌స్ట్రక్టర్లు అందించిన శిక్షణ తోడ్పడింది. తక్కువ సమయంలో ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది. **-జవిందర్**

### గురుకులంలో చదవడం అదృష్టం



డిఫెన్స్‌లో ఫైర్‌మెన్ ఏవోసీకి ఎంపికయ్యాను. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతుండగా ఉద్యోగం వచ్చింది. గురుకులంలో చదవడం నా అదృష్టం. క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఏదైనా సాధించొచ్చు. తల్లిదండ్రుల రుణం తీర్చుకుంటా. **-సింహాద్రి**

### ఉన్నతాధికారిగా దేశానికి సేవలందిస్తా



డిగ్రీ చదువుతుండగానే ఉద్యోగం వచ్చింది. నేవీలో శిక్షణ పూర్తయింది. పాఠశాల ఉపాధ్యాయుల సూచనలు పాటించి పట్టుదలతో చదివి ఈవెంట్లు చేశాను. ఉన్నతాధికారిగా దేశానికి సేవలందిస్తా. **-భరత్**

### ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ
**- సురేందర్, ప్రిన్సిపల్, సైనిక్‌స్కూల్, అశోక్‌నగర్**

క్రమశిక్షణతో చదివితే ఉద్యోగాలు సాధించడం సులువని సైనిక్‌స్కూల్ విద్యార్థులు నిరూపించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతాం. అందరి కృషితోనే ఇది సాధ్యమైంది.

# ఉపాధి కోసం వెళ్లి.. తూటాకు బలై!

● ఉగాండాలో జనగామ సివిల్ ఇంజినీర్ హత్య



తిరుమలేశ్ (పాత చిత్రం)



స్వగృహంలో రోదిస్తున్న తల్లి కిష్టమ్మ, బంధువులు

**జనగామ టౌన్, న్యూస్‌టుడే:** ఉన్నత విద్య అభ్యసించారు.. ఉపాధి మార్గం వెతుక్కుంటూ విదేశానికి వెళ్లారు.. జీవితం అంతా సాఫీగా సాగుతుందనుకున్న సమయంలో ఉపాధికి వెళ్లిన చోటే తూటా రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. ఈ ఘటన జనగామ పట్టణంలో విషాదం నింపింది. జనగామ పట్టణం తొమ్మిదో వార్డు గిర్నిగడ్డకు చెందిన ఇటికాల తిరుమలేశ్(42) సివిల్ ఇంజినీర్ పూర్తి చేశారు. కొంతకాలం కరీంనగర్‌లో ఉద్యోగం చేసిన అనంతరం ఉగాండా దేశంలోని రాయల్‌టెక్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో అవకాశం రావడంతో పదేళ్ల క్రితం అక్కడికి వెళ్లారు. ప్రాజెక్టు మేనేజర్ హోదాలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఉగాండాలోని నమ్యూళ ప్రాంతంలోని కంపెనీలో శుక్రవారం తిరుమలేశ్ విధుల్లో ఉండగా శుక్రవారం ఉదయం 9.30 గంటల సమయంలో(భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12.30 గంటలకు) అదే కంపెనీకి చెందిన సెక్యూరిటీ గార్డు తాగిన మైకంలో ఒక్కసారిగా తుపాకీతో గాల్లోకి రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. భారీ శబ్దం విని బయటకు వచ్చిన తిరుమలేశ్‌పైనా విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ తర్వాత సెక్యూరిటీ గార్డు కూడా తనను తాను కాల్చుకుని చనిపోయాడు. ఈ ఘటనతో భయపడి కంపెనీలోని ఇతర ఉద్యోగులు బయటకు రాలేదు. తిరుమలేశ్ మృతిచెందిన విషయాన్ని కంపెనీ ప్రతినిధులు జనగామలో ఉంటున్న తల్లి కిష్టమ్మ, సోదరుడు చిన్నాకు సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులంతా ఒక్కసారిగా శోకసంద్రంలో మునిగిపోయారు. తిరుమలేశ్‌కు భార్య సునీత, కుమార్తె అఖిల, కుమారుడు వరుణ్ ఉన్నారు. కుమార్తె అఖిల నిజామాబాద్‌లోని అమ్మమ్మ ఇంటి వద్ద 8వ తరగతి చదువుతోంది. కుమారుడు వరుణ్ ఉగాండాలోనే తల్లిదండ్రులతో ఉంటూ పదోతరగతి చదువుతున్నాడు. తిరుమలేశ్ తండ్రి కిష్టయ్య కరోనాతో నాలుగేళ్ల క్రితం మృతి చెందారు. మృతుడి తల్లి కిష్టమ్మతో పాటు మరో సోదరుడు చిన్నా, సోదరి హేమలత జనగామలోనే ఉంటున్నారు. తిరుమలేశ్ మృతి వార్త తెలియగానే ఆయన ఇంటికి బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించి కన్నీళ్లు పెట్టుకున్నారు.

### అంతా సివిల్ ఇంజినీర్లే

మృతిచెందిన తిరుమలేశ్ సివిల్ ఇంజినీర్ కాగా, ఆతని సోదరుడు చిన్నా కూడా సివిల్ ఇంజినీర్‌గా సిద్దిపేటలో పనిచేస్తున్నారు. తండ్రి కిష్టయ్య సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసేవారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించి మంచి స్థానాలకు చేర్చిన తండ్రి కిష్టయ్య కరోనాతో దూరంగా కాగా, ఇప్పుడు ఇంటి పెద్ద కొడుకు తిరుమలేశ్ కూడా చనిపోవడంతో తల్లి కిష్టమ్మతో పాటు కుటుంబమంతా శోకసంద్రంలో మునిగిపోయింది. తిరుమలేశ్ మృతదేహం స్వదేశానికి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సోదరుడు చిన్నా తెలిపారు. ఉగాండాలోని ఎంబసీ అధికారులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ద్వారా సమాచారం చేరవేసి మృత దేహం రప్పించేందుకు స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవ తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# అవివాహితులకు సువర్ణావకాశం

● నేడు ఎస్టీ (బంజార/లంబాడ) కులాల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి డాట్ నెట్ ఉచిత నమోదు కార్యక్రమం



**బాలసముద్రం, న్యూస్‌టుడే:** తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లిపందిరి' వేదికగా సువర్ణ అవకాశం కల్పిస్తోంది. ఎస్టీ (బంజారా/లంబాడ) కులాలకు చెందిన అవివాహిత వధూవరుల కోసం ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. బాలసముద్రంలోని 'ఈనాడు' కార్యాలయంలో ఆదివారం (అక్టోబర్ 6వ తేదీ) ఈ కార్యక్రమం చేపట్టింది. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులు లేదా సంబంధిత కుటుంబీకులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5:30 గంటలలోపు ఈ కార్యక్రమంలో పాల్గొని ఉచితంగా వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఫోన్ ద్వారా నమోదు చేసుకునే వారు తమ బయోడేటా, ఫొటోలను 83744 45190, 80080 02165 నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపవచ్చు. మరిన్ని వివరాలకు ఇవే ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

# అండర్-19 క్రికెట్ పోటీల విజేత కరీంనగర్

**వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే:** ఉత్కంఠ భరితంగా సాగిన పోటీలో మహబూబ్‌నగర్ జట్టుపై కరీంనగర్ 2 వికెట్లతో తేడాతో విజయం సాధించింది. హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఓరుగల్లు జిల్లా కేంద్రంగా నిర్వహించిన అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ముగిశాయి. శనివారం వరంగల్ నగర శివారులో ఉన్న మొగిలిచర్ల మైదానంలో మహబూబ్‌నగర్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల జట్ల మధ్య తుదిపోరు జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మహబూబ్‌నగర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. జట్టులో షాదాబ్ 89, అబ్దుల్ 48 పరుగులతో రాణించారు. కరీంనగర్ బౌలర్లు విఘ్నేష్, అర్షద్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో కరీంనగర్ జట్టు 49.5 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 241 పరుగులు చేసి విజేతగా నిలిచింది. విఘ్నేష్ 53 పరుగులు, కమ్రాన్ 50 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చారు. అనంతరం జరిగిన ముగింపు వేడుకలో అతిథులు విజేత, రన్నరప్ జట్లకు ట్రోఫీలు అందించారు. ఈ సందర్భంగా వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. అండర్-19 టోర్నీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రికెటర్లను హెచ్‌సీఏ జట్టుకు ఎంపిక చేయాలని కోరారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు పెద్ది ప్రవీణ్‌గౌడ్, బస్వరాజు శ్రీమాన్, ఉదయభానురావు, వెంకటేశ్వర్లు, రఘురాం, ఉపేందర్, రాము, కుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.



కరీంనగర్ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న అతిథులు

# 'అలుగు' అక్రమ రవాణా కేసులో స్మగ్లర్ల అరెస్టు

**భూపాలపల్లి, న్యూస్‌టుడే:** భూపాలపల్లి అటవీ రేంజి పరిధిలోని మేడిపెల్లి టోల్‌గేట్ ప్రాంతంలో అలుగు (పొంగలిన్) రవాణాకు పాల్పడిన కేసులో శనివారం ఐదుగురు స్మగ్లర్లను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చినట్లు భూపాలపల్లి అటవీ అధికారులు తెలిపారు. ఇదే కేసులో చెన్నైకి చెందిన వైల్డ్ లైఫ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో, ఇంటెలిజెన్స్ అధికారులు చాకచక్యంగా కొనుగోలుదారుల రూపంలో తాటి రాజ్‌కుమార్, ఎండీ. నజీర్, ఎండీ.అమ్జద్‌ఖాన్‌లను అదుపులోకి తీసుకుని హనుమకొండకు తరలించిన విషయం తెలిసిందే. వీరిని విచారించగా మరో ఐదుగురి ప్రమేయం ఉందని నిందితులు చెప్పినట్లు స్థానిక రేంజి అధికారి నరేష్ అరెస్టు వివరాలను వెల్లడించారు. గట్టు సమ్మయ్య, తాళ్లపల్లి శంకర్, ఊరుగొండ దేవన్న, పెద్ది లక్ష్మయ్య, నరివెద్ది వెంకటనారాయణ కోసం గాలించగా గట్టు సమ్మయ్య, నరివెద్ది వెంకటనారాయణను అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వారు పరారీలో ఉన్నారని, మొత్తం 8 మందిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అరెస్టు అయిన వారిలో కాటారం మండలం కొత్తపల్లి, ములుగుపల్లి, ఇబ్రహీంపల్లికి చెందిన తాటి రాజ్‌కుమార్, గట్టు సమ్మయ్య, ఎండీ.అమ్జద్‌ఖాన్, మహాముత్తారం మండలం యామన్‌పల్లికి చెందిన ఎండీ. నజీర్, భూపాలపల్లికి చెందిన నరివెద్ది వెంకటనారాయణ ఉన్నారు. వీరి నుంచి రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు రేంజి అధికారి నరేష్ తెలిపారు. కాటారం అటవీ రేంజి అధికారి హసీప్ అలీ, సెక్షన్ అధికారి సంతోష్, బీట్ ఆఫీసర్లు ప్రశాంత్, భాస్కర్ పాల్గొన్నారు.



అరెస్టు చూపుతున్న భూపాలపల్లి అటవీ అధికారులు

### చికెన్ ధరలు
(కిలో వెల రూపాయలలో)

| వెన్‌కాబ్ | |
|---|---|
| ఫాం: | 114 |
| రిటైల్: | 136 |
| డ్రెస్డ్: | 197 |
| స్కిన్‌లెస్: | 224 |

# కుస్తీ పోటీల్లో ఓరుగల్లుకు కాంస్యం

**వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే:** రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్‌ఐ) కుస్తీ(రెజ్లింగ్) పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు తృతీయస్థానంలో నిలిచింది. నారాయణపేట జిల్లా ధన్వాడలో శనివారం జరిగిన కుస్తీ పోటీల్లో అండర్-19 బాలికల జట్టు పతకాలతో రాణించింది. బి.అంజలి 55 కిలోల విభాగంలో స్వర్ణం కైవసం చేసుకుంది. 69 కిలోల విభాగంలో సౌమ్య, 76 కిలోల విభాగంలో ఎన్.అంజలి రజత పతకాలు, 59 కిలోల విభాగంలో కావేరి, 72 కిలోల మైత్రేయి కాంస్య పతకాలు సాధించారు. స్వర్ణం నెగ్గిన బి.అంజతి దిల్లీలో జరిగే ఎస్‌జీఎఫ్‌ఐ(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) జాతీయస్థాయి కుస్తీ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు హనుమకొండ జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి, హనుమకొండ కళాశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. పతకాలు సాధించిన రెజ్లర్లను హనుమకొండ జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గోపాల్, తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ సంఘం కార్యదర్శి కరీం అభినందించారు.



తృతీయ స్థానంలో నిలిచిన జట్టుతో అతిథులు

# సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ



కేవీ పాఠశాలలో..



రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మ సంబరాలు జిల్లాలో వైభవంగా కొనసాగుతున్నాయి. నర్సంపేట మండలంలోని లక్నేపల్లి బిట్స్ కళాశాలలో ముందస్తుగా సద్దుల బతుకమ్మ, దసరా (రావణాసుర వధ)ను శనివారం నిర్వహించారు. కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోటలోని కేవీ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయినులు బతుకమ్మ వేడుకలు నిర్వహించుకున్నారు. బొల్లికుంట వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో వచ్చి బతుకమ్మ ఆడారు.

– న్యూస్‌టుడే, జిల్లా యంత్రాంగం



బొల్లికుంట వాగ్దేవి కళాశాల ప్రాంగణంలో..



నర్సంపేటలో.. బతుకమ్మలతో అధ్యాపకులు, విద్యార్థులు



శివనగర్ సీతారామాలయంలో..



34వ డివిజన్‌లో..



శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో..



ఎంజీఎం కూడలిలో..


# ప్రత్యేక అలంకరణలు.. నిష్ఠతో పూజలు

జిల్లాలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం వివిధ ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అమ్మవారు గాయత్రి మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. వరంగల్ ప్రాంతం ఎంజీఎం కూడలిలోని శ్రీరాజరాజేశ్వరి దేవి శనివారం రోహిణి మాతగా దర్శనమిచ్చారు. రంగశాయిపేట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శ్రీరామ భజన మండలి మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి రజతోత్సవంలో భాగంగా శనివారం సువాసిని పూజ నిర్వహించారు. 33 మంది ముత్తైదువులను దుర్గా పరదేవతగా భావించి పూజించారు. చీర, గాజులతో కూడిన 9 రకాల సామగ్రితో సత్కరించారు. అనంతరం అన్న ప్రసాదాలను అందజేశారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శనివారం మండలంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు.

– న్యూస్‌టుడే, జిల్లా యంత్రాంగం



రంగశాయిపేట రామాలయంలో మహిళలు



నర్సంపేట వల్లభ్‌నగర్‌లో..



కాట్రపల్లిలో అన్నపూర్ణాదేవిగా..



**శివనగర్:** వరంగల్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయం దగ్గర ఉన్న కేపీ రెడ్డి ఐస్‌క్రీమ్ సమీపంలోని వివేక్‌మార్గ్ కాలనీలోని వీధిదీపం వెలగడం లేదు. రాత్రివేళ బయటకు రావడానికి భయపడుతున్నారు. **- స్వామి, స్థానికుడు**

**సమాధానం:** రెండురోజుల్లోగా మరమ్మతులు చేయిస్తాం. **- సంతోష్, ఏఈ, ఎలక్ట్రికల్స్**

**కార్పొరేషన్:** 11వ డివిజన్ వివేక్ మార్గ్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయం పక్కన కేపీరెడ్డి ఐస్ క్రీం పార్లర్ గల్లీ ఎస్ఎన్ఈఐ 4/1 వీధిదీపం వెలగడం లేదు. **- స్థానికులు**

**సమాధానం:** రెండు, మూడు రోజుల్లో వీధి దీపానికి మరమ్మతులు చేస్తాం. **-నరేష్, ఎలక్ట్రికల్ ఏఈ బల్దియా**

**సమస్య:** వరంగల్ చింతల్ పుప్పాలగుట్ట బ్యాంకు కాలనీ ఇంటి నంబరు 16-9-589/10 వీధిలో వారంరోజులుగా మురుగు కాలువలు తీయడం లేదు.

**- బ్యాంకు కాలనీవాసులు**

**సమాధానం:** రెండు రోజుల్లో కాలువలు శుభ్రం చేస్తాం. **- డాక్టర్ రాజేష్, ఆరోగ్యశాఖ అధికారి**

**సమస్య:** 11వ డివిజన్ రంగంపేట చర్చి గల్లీలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. గుంపులు గుంపులుగా ఇళ్లలోకి వస్తున్నాయి. **- శ్యాంసన్, రంగంపేట**

**సమాధానం:** నాలుగైదు రోజుల్లో కోతుల బోను ఏర్పాటు చేస్తాం. **- శ్యాంరాజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

**నర్సంపేట:** రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నర్సంపేటలోని విజ్‌డమ్ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని చందన ఎంపికైనట్లు హ్యాండ్‌బాల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి గ్రేస్, ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సారంగపాణి శనివారం తెలిపారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి పంపిణీ చేసిన ఏకరూప దుస్తులతో కోనాయమాకులలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు

**సంగెం, న్యూస్‌టుడే:** అర్హులైన నిరుపేదలందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఫ్యామిలీ డిజిటల్ కార్డుల ప్రక్రియను ప్రారంభించిందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కృష్ణానగర్‌లో జరుగుతున్న సర్వేను ఎమ్మెల్యే పరిశీలించారు. కుటుంబ సమగ్ర సమాచారాన్ని పొందుపరిచి అందించే ఎఫ్‌డీసీల ద్వారా ఇక ముందు ప్రభుత్వ పథకాలు అందించనున్నట్లు తెలిపారు. అనంతరం ఎల్గూర్ రంగంపేట్ ఊర చెరువులో చేప పిల్లలను వదిలారు. కాకతీయ వస్త్ర పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థ జలాలు చెరువులో కలుస్తున్నాయని చేపల మనుగడకు ప్రమాదం ఉందని మత్స్యకారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆయన జోనల్ మేనేజర్‌తో చరవాణిలో మాట్లాడి నీటి కాలుష్యంపై విచారణ చేసి నివేదిక అందించాలని ఆదేశించారు.

**గీసుకొండ:** మండలంలోని కోనాయమాకులలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సొంత నిధులతో శనివారం 196 మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. కళాశాలలో సమస్యల్ని పరిష్కరిస్తానని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.

## గోదాం పరిశీలన

**ఎనుమాముల మార్కెట్:** మామిడి మార్కెట్ ఏర్పాటు కోసం పరిశీలనలో ఉన్న ఎనుమాముల ముసలమ్మకుంటలోని గోదాం స్థలాన్ని మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు వి.శ్రీనివాస్ శనివారం సందర్శించారు. గోదాం వరకు వాహనాల రాకపోకల కోసం రహదారి నిర్మాణం, చేపట్టాల్సిన తదితర అభివృద్ధి పనులకు సంబంధించి డీఈ ఎల్లేశ్‌తో చర్చించారు. మార్కెట్ కార్యదర్శి నిర్మల, ఛాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, పండ్ల వ్యాపారులు వెల్ది సాంబయ్య, చెన్నమల్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## నగదు అపహరణపై ఫిర్యాదు

**ఖిలావరంగల్, న్యూస్‌టుడే:** కారులో పెట్టిన నగదు చోరీకి గురైన ఘటనపై శనివారం మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేశారు. హనుమకొండ భీమ్‌నగర్‌కు చెందిన డా.శ్రీనివాస్ వరంగల్ సంరక్ష ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. శ్రీనివాస్ కారు చోదకుడు శరత్‌కుమార్ ఈ నెల 1న కారు బయటికి తీసుకెళ్లి వచ్చాడు. మరుసటి రోజు కారును పరిశీలించగా.. అందులోని రూ.54 వేల నగదు కనిపించలేదు. దీంతో బాధితుడి చోదకుడిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదు చేశారు.

## రోడ్డు ప్రమాదం.. కేసు నమోదు

**ఖిలావరంగల్, న్యూస్‌టుడే:** వరంగల్- నర్సంపేట ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంపై మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై సురేష్ కథనం ప్రకారం.. దేశాయిపేటకు చెందిన జన్ను పుష్ప శుక్రవారం లేబర్‌కాలనీకి వెళ్లి తిరిగి కాలినడకన ఇంటికి వస్తున్నారు. సెంటినరీ బాప్టిస్ట్ చర్చి వద్ద రోడ్డు దాటుతుండగా.. నర్సంపేట వైపునకు వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు ఢీ కొట్టాడు. గాయపడిన ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఆమె కుమారుడు అనిల్‌కుమార్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## రైసు మిల్లుల్లో అధికారుల ఆకస్మిక తనిఖీలు

**నర్సంపేట, న్యూస్‌టుడే:** నర్సంపేట, ఖానాపురం మండల పరిధిలోని నాలుగు రైసు మిల్లులపై నర్సంపేట డీటీసీఎస్ సంధ్యారాణి, ఎఫ్‌సీఐ కేంద్ర బృందం అధికారులు రవీందర్, ప్రశాంత్‌లు శనివారం ఆకస్మికంగా దాడులు చేసి తనిఖీలు చేశారు. నర్సంపేట మండలం ఖానాపురం మార్గంలోని గోపికృష్ణ, రాధాకృష్ణ మిల్లులో ధాన్యం, బియ్యం నిల్వలు, వివిధ రకాల పుస్తకాలను పరిశీలించారు. ఖానాపురం మండలంలోని విజయలక్ష్మి, శ్రీనివాస్ మిల్లులను సందర్శించి తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు.

## ప్రైవేట్ అంబులెన్స్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

**దుగ్గొండి, న్యూస్‌టుడే:** మండలంలోని వరంగల్- నర్సంపేట ప్రధాన రహదారి చలపర్తి వినాయక ధాన్యం మిల్లు సమీపంలో అదుపు తప్పిన ప్రైవేట్ అంబులెన్స్ ద్విచక్ర వాహనాన్ని శుక్రవారం రాత్రి ఢీ కొట్టింది. రోడ్డు ప్రమాదంలో నర్సంపేట మండలం మహేశ్వరం గ్రామానికి చెందిన మాధవరెడ్డి, మధులు తీవ్రంగా గాయపడ్డారు. మహేశ్వరం గ్రామానికి చెందిన మాధవరెడ్డి, మధు వాహనంపై కొమ్మాలలో గ్రామానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వినాయక ధాన్యం మిల్లు సమీపంలో నర్సంపేట నుంచి వరంగల్ వైపునకు వెళ్తున్న ప్రైవేట్ అంబులెన్స్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితులు తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరుతున్నారు.



## సంక్షిప్తంగా

### విశ్రాంత ఎంఈవోకు నివాళులు

**రంగశాయిపేట, న్యూస్‌టుడే:** శంభునిపేట 41వ డివిజన్ శ్రీనగర్‌కాలనీకి చెందిన విశ్రాంత ఎంఈఓ నిమ్మగడ్డ రాధాకృష్ణ(75) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు శనివారం నివాళులర్పించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. రెడ్‌క్రాస్ మాజీ ఛైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, కాలనీల అధ్యక్షుడు కర్నె రవీందర్ ఉన్నారు.

### గుట్కా పట్టివేత

**వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే:** నర్సంపేట పోలీసు డివిజన్ దుగ్గొండి ఠాణా పరిధిలో గుట్కాను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ తెలిపారు. దుగ్గొండి మండల కేంద్రంలోని వెంకటేశ్వర్ కిరాణం దుకాణంలో గుట్కా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో స్థానిక పోలీసులతో కలిసి టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తనిఖీ చేశారు. రూ.16వేల విలువ చేసే గుట్కాను స్వాధీనం చేసుకొని యజమాని వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకొన్నారు.

### చైతన్య కళాబృందం సభ్యుడికి ఆర్థిక సాయం

**పర్వతగిరి:** మండలంలోని సోమారం గ్రామానికి చెందిన కళాకారుడు ఆకులపెల్లి కరుణాకర్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. శనివారం చైతన్య కళాబృందం ఆధ్వర్యంలో రూ.7000 నగదు అందజేశారు. వల్లందాసు లక్ష్మణ్, బరిగల వెంకన్న, కందిక సుధాకర్, ఇజ్జగిరి గణేష్, గొలుసుల రంజిత్, గౌరారపు యుగందర్, నరుకుడు రాజు ఉన్నారు.

### కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**కార్పొరేషన్, న్యూస్‌టుడే:** గ్రేటర్ వరంగల్ ప్రజారోగ్య విభాగం ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కొత్త ముఖ్యఆరోగ్యశాఖ అధికారి డా.రాజారెడ్డిని ఉద్యోగ ఐకాస ప్రతినిధులు కోరారు. సీఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టినందుకు అభినందనలు తెలిపారు. బొట్ల భిక్షపతి, ధర్మరాజు, బిర్రు శ్రీనివాస్, బొట్ల రమేష్, బాకం సంతోష్, రాజారపు భాస్కర్, బాలునాయక్ తదితరులున్నారు. ఐఎన్‌టీయూసీ ప్రతినిధులు పుల్లా రమేష్, పాశం రవి, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు రాజారెడ్డిని అభినందించారు.

### కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం

**పర్వతగిరి:** కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) 26వ ఆవిర్భావ దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించి, మిఠాయి పంపిణీ చేశారు. అనంతరం సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోడేటి దయాకర్ మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాదాసి యాకూబ్, మునిగె కుమారస్వామి, సురేందర్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

### కేవీకేలో ముగిసిన శిక్షణ శిబిరం

**మామునూరు:** మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే), జాతీయ మత్స్య అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో చేపల వ్యాధి నిర్ధారణ, ఆరోగ్య నిర్వహణపై రైతులకు ఏర్పాటు చేసిన అయిదురోజుల శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న వివిధ నిర్దేశిత మత్స్య పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసిన రైతులు, యువకులకు వరంగల్ జిల్లా మత్స్య అధికారి నాగమణి ప్రశంసాపత్రాలను అందజేశారు. చేపల పెంపకంలో మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటించి, అధిక లాభాలను పొందాలన్నారు. శాస్త్రవేత్తలు సౌమ్య, గణేష్, శశాంక్, సాయికిరణ్ పాల్గొన్నారు.

## రూ.10 నాణేలపై అపోహలు వద్దు



నాణేలు పంపిణీ చేస్తున్న ఎస్బీఐ అధికారులు

**గిర్మాజీపేట, న్యూస్‌టుడే:** భారతీయ రిజర్వ్ బ్యాంకు విడుదల చేసిన రూ.10 నాణేలు చెలామణిలోనే ఉన్నాయని.. వీటి విషయంలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని భారతీయ స్టేట్ బ్యాంకు జనరల్ మేనేజరు నెట్‌వర్క్ 2 ప్రకాశ్ చంద్ర బరోర్ పేర్కొన్నారు. రూ.10 నాణేల చెల్లుబాటుపై వరంగల్ జేపీఎన్ రోడ్డులోని ఎస్బీఐ ప్రధాన శాఖలో శనివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నగరంలోని కొందరు వ్యాపారులకు.. నోట్లకు బదులుగా రూ.10 నాణేలు పంపిణీ చేశారు. జీఎం నెట్‌వర్క్ 1 రవికుమార్ వర్మ, బ్యాంకు మేనేజరు డీఎస్ నరేంద్రకుమార్, ఏజీఎంఎస్ జి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## బసవన్న చెరువు కట్టపై ముళ్ల చెట్ల తొలగింపు

**గీసుకొండ, న్యూస్‌టుడే:** 'పైసలు లేవు.. పండగ ఏర్పాట్లు ఏలా ?' అనే శీర్షికతో ఈనాడు దినపత్రికలో శుక్రవారం ప్రచురించిన ప్రత్యేక కథనానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్పందించారు. ఉత్సవాలను నిర్వహించడానికి ఖర్చును సమకూర్చడంపై చర్చించడానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి నియోజకవర్గంలోని ఎంపీడీవో, ఎంపీవోలు, గ్రామ ప్రత్యేకాధికారులతో పరకాలలో సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గీసుకొండలోని బసవన్న చెరువు కట్టపై ఇరువైపుల ముళ్ల పొదలు ఉండటంతో పంచాయతీ సిబ్బంది తొలగించారు.

## నర్సంపేట నియోజకవర్గం

### పేద ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

**నర్సంపేట, న్యూస్‌టుడే:** పేదల సంక్షేమం, అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నర్సంపేటలోని క్యాంపు కార్యాలయంలో నర్సంపేట, ఖానాపురం, నల్లబెల్లి, దుగ్గొండి మండలాలకు చెందిన 95 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. మార్కెట్ ఛైర్మన్ శ్రీనివాస్, పీసీసీ సభ్యుడు రామానంద్, కౌన్సిలర్లు, నాయకులు, మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

### డిజిటల్ కార్డుల సర్వే వేగవంతం చేయండి



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ డా.సత్యశారద

**నర్సంపేట:** ప్రయోగాత్మకంగా చేపట్టిన కుటుంబ డిజిటల్ కార్డుల సర్వేను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ డా.సత్యశారద అన్నారు. నర్సంపేట పురపాలక పరిధిలోని 18 వార్డులో చేస్తున్న డిజిటల్ కార్డుల సర్వేను శనివారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో ఉన్న 200 ఇళ్ల సర్వేను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**దుగ్గొండి:** కుటుంబ డిజిటల్ ఇంటింటి సర్వే వివరాలను ప్రత్యేక నమూనాలో ఆన్‌లైన్ చేయాలని కలెక్టర్ డా.సత్యశారద అన్నారు. శనివారం దుగ్గొండి మండలంలోని మథిర మందపల్లిలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన కుటుంబ డిజిటల్ కార్డుల ఇంటింటి సర్వే వివరాలను పరిశీలించారు.

### రాష్ట్ర సాధనలో ప్రత్యేక ముద్ర



మాట్లాడుతున్న అంబటి శ్రీనివాస్, ఐకాస నాయకులు

**నర్సంపేట, న్యూస్‌టుడే:** రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమాల్లో నర్సంపేటకు ప్రత్యేక ముద్ర ఉందని తెజస రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తెలంగాణ ఐకాస డివిజన్ ఛైర్మన్ అంబటి శ్రీనివాస్ అన్నారు. నర్సంపేటలో శనివారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా అన్ని ఉద్యోగ, కుల, విద్యార్థి, యువజన సంఘాలు ఐకాసను ఏర్పాటు చేసుకొని ఉద్యమాలు చేసినట్లు తెలిపారు. పదేళ్ల అధికారంలో ఉన్న భారాస నేతలు ఉద్యమకారులను విస్మరించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం నర్సంపేటలో జరిగే ఉద్యమకారుల సదస్సుకు ఎమ్మెల్సీ, ఐకాస నేత ప్రొఫెసర్ కోదండరాం హాజరు కానున్నట్లు తెలిపారు.

### ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి పెసా సభలు కీలకం

**నర్సంపేట గ్రామీణం:** ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి పెసా గ్రామ సభలు కీలకమని నర్సంపేట మండల పంచాయతీ అధికారి రామ్మోహన్ అన్నారు. శనివారం నర్సంపేట మండలం ముత్యాలమ్మతండాలో ఐటీడీఏ అధికారుల ఆదేశానుసారం పెసా గ్రామసభను నిర్వహించారు. తండాలోని అర్హులైన వారికి గిరి వికాస్ పథకాన్ని అమలు చేయాలని, సీసీ రోడ్లు, సైడు కాలువలు, పంచాయతీ భవన నిర్మాణం కోసం తీర్మానం చేశారు.

### పొదుపుతోనే ఆర్థికాభివృద్ధి

**ఖానాపురం:** స్వకృషి పొదుపు సంఘాల పొదుపులతో గ్రామాల్లో ఆర్థికాభివృద్ధి సాధ్యమని సహ వికాస సంస్థ అధ్యక్షురాలు జయప్రద అన్నారు. శనివారం నర్సంపేట పురుషుల పొదుపు సమితి పరిధిలోని మనుబోతులగడ్డ సంఘం నూతన భవనాన్ని ఆమె ప్రారంభించారు. ప్రతినిధులు రాజశ్రీ, శ్రీనివాస్, స్రవంతి, సంఘం అధ్యక్షుడు, మీరాసాహెబ్, ఉపాధ్యక్షుడు అశోక్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### చెడు అలవాట్లకు బానిస కావొద్దు

**చెన్నారావుపేట:** పిల్లలు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం చెన్నారావుపేట ఠాణా పరిధిలో రామన్నకుంట తండాలో పోలీసులు నిర్బంధ తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో 30 లీటర్ల గుడుంబా, 1100 లీటర్ల బెల్లం పానకం, 3 సంచుల పంచదార, 10 కిలోల బెల్లం స్వాధీనం చేసుకొని ఆబ్కారీ అధికారులకు అప్పగించినట్లు చెన్నారావుపేట ఎస్సై రాజేష్‌రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### దాత కుటుంబ సభ్యులకు సత్కారం

**చెన్నారావుపేట:** వైద్య విద్యార్థుల కోసం పార్థివ దేహాన్ని వైద్య కళాశాలకు అప్పగించిన కుటుంబ సభ్యులను శనివారం సన్మానించారు. మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కోన్‌రెడ్డి అయిల్‌రెడ్డి (85) మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గత నెల 25న నర్సంపేటలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు అప్పగించారు. మృతుడి దశదిన కర్మను పురస్కరించుకొని తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులను సన్మానించి, ధ్రువపత్రం అందించారు. అసోసియేషన్ బాధ్యులు మల్లారెడ్డి, ఉపేందర్, శంకర్‌రావు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### హోంగార్డుపై దాడి

**నర్సంపేట:** ప్రధాన రహదారిపై నిలిపిన ఆటోను తీయమని చెప్పడంతో ఓ రౌడీషీటర్ హోంగార్డుపై దాడి చేశారు. ఈ ఘటన శనివారం రాత్రి నర్సంపేటలో చోటు చేసుకుంది. ఎస్సై అరుణ్ కథనం ప్రకారం.. నర్సంపేట పట్టణానికి చెందిన చంటి శ్రీకాంత్ అనే రౌడీ షీటర్ ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. మద్యంతాగి రాత్రి 9 గంటల సమయంలో అంగడి కూడలిలో ఆటో నిలిపాడు. విధుల్లో ఉన్న హోంగార్డు బిక్షపతి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని ఆటోను తీయమని శ్రీకాంత్‌కు సూచించగా దుర్భాషలాడి హోంగార్డుపై చేయి చేసుకున్నారు. హోంగార్డు బిక్షపతి ఫిర్యాదు మేరకు శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్ పేర్కొన్నారు.